# 1



# అవచారం

ఆరి సీతారామయ్య

కేసు ఫైలు జాగ్రత్తగా చదివింది కమల. రోగి పేరు ఎమిలీ. యాభై మూడు సంవత్సరాల వయసు. హైస్కూల్ టీచర్. ఇంతకుముందు జబ్బేమీ ఉన్నట్టు లేదు. వారంరోజులుగా సరిగ్గా నిద్రాహారాలు లేవనీ, చాలా దీనంగా కన్పిస్తున్నదనీ భయపడి, భర్త ఆమెను డాక్టరుకు చూపించటానికి తీసుకెళ్లాడు.

ఆయన ఎమిలీకేదో మానసిక వ్యాధి అని నిర్ణయించి, హాస్పిటల్లో సైకియాట్రీ వార్డులో చేర్పించాడు.

“హాస్పిటల్లో చేరాల్సిన అవసరం ఈ ఫైల్లో ఏమీ కన్పించటంలేదు. రోగి ఏదో దాస్తున్నట్టుంది. ఒకటి రెండు రోజుల్లో అసలు విషయం తెలుస్తుంది. బహుశ డ్రగ్స్‌కు సంబంధించిన కేసై ఉండొచ్చు,” అనుకుంది కమల.

మరుసటిరోజు ఉదయం వార్డులో ఎమిలీ బెడ్ దగ్గరకొచ్చి, “హాయ్! నా పేరు కమల. నేనిక్కడ సోషల్ వర్కర్ని. రాత్రి బాగా నిద్రపట్టిందా మీకు,” అని అడిగింది.

“ఊహూఁ బాగానే పట్టింది,” అంది ఎమిలీ కొంచెం అనుమానంగా చూస్తూ. ఈ అమ్మాయి కూడా ఇండియన్ లాగుంది. వీళ్లకసలు వైద్యం తెలుసో, లేదో. ఇట్లా హాస్పిటల్ నిండా డాక్టర్లే కాకుండా, సోషల్ వర్కర్లు కూడా వీళ్లే ఎందుకున్నారూ? తెల్లవాళ్లంతా ఏమయ్యారూ? ఈ తక్కువజాతి వాళ్లకి తన గురించి చెప్పుకోవాలన్నా ఇబ్బందిగానే ఉందామెకు.

ఏమన్నా అల్పాహారం తిన్నారా అని కమల అడిగితే, దానిక్కూడా తలూపుతూనే సమాధానం చెప్పింది ఎమిలీ.

“ఈమధ్య మీకు చాలా అలసటగా ఉండిందా,” అనడిగింది కమల.

“లేదు. మామూలుగానే ఉండింది.”

“ఇంటి దగ్గర పన్లెక్కువయ్యాయా?”

“లేదు.”

“స్కూల్లో బాధ్యతలేమన్నా ఎక్కువయ్యాయా?”

“లేదు. నాకు స్కూలంటే చాలా ఇష్టం. స్కూల్లో ఉన్నంతసేపూ నన్ను నేను మర్చిపోతాను. కాలం ఊరికే గడిచిపోతుంది,” అంది ఎమిలీ చిరునవ్వుతో.

ఇంటి గురించి క్లుప్తంగా చెప్పిన మనిషి, స్కూలు గురించి బారెడు సమాధానం చెప్పటంతో సమస్య ఇంటి దగ్గరే ఉండి ఉంటుందని గ్రహించింది కమల. కానీ, ఆమెతో స్నేహ సంబంధం ఏర్పడాలంటే కొంచెం సేపు స్కూలు గురించి మాట్లాడ్డమే మంచిదనుకుంది.

“మీరేం పాఠాలు చెప్తారు స్కూల్లో.”

“ఇంగ్లీషు.”

“ఎక్కడ చదివారింగ్లీషు?”

“అదెప్పుడో పాతికేళ్లనాటి సంగతి. చికాగో యూనివర్శిటీలో ఎం.ఏ. చదివాను,” అని, “నువ్వెక్కడ చదివావు” అనడిగింది ఎమిలీ.

“మిషిగన్ యూనివర్శిటీలో చదివాను,” అని, “మీకు పిల్లలున్నారా,” అనడిగింది కమల.

“ఇద్దరమ్మాయిలు. మా పెద్దమ్మాయి కూడా చికాగోలోనే చదివింది,” అందామె గర్వంగా. “మా చిన్నమ్మాయి నీలాగే మిషిగన్లో చదివింది.” నా కూతురు కూడా అక్కడే చదివింది గాబట్టి నీ మిషిగన్ చదువు ఫరవాలేదులే అన్నట్టు చూస్తూ.

“మీరు విశ్రాంతి తీసుకోండి. సాయంత్రం గ్రూప్ థెరపీ నడిపేది నేనే. అప్పుడు మళ్లా మాట్లాడుకుందాం,” అని నవ్వుతూ తన ఆఫీసు వైపు వెళ్లిపోయింది కమల.

*

గ్రూప్ థెరపీ అంటే సామూహిక వైద్యం. పది మంది మానసిక రోగులు ఒకచోట కూర్చొని మాట్లాడు కుంటారు. ఒక్కొక్కరూ తమ జబ్బు గురించి, దానివల్ల పడుతున్న ఇబ్బందుల గురించీ చెప్పుకుంటారు. ఈ జబ్బుల గురించి కానీ, వాటిని వదిలించుకునే మార్గం గురించి కానీ ఎవరికి తోచింది వారు ఫ్రీగా చెప్తారు. తన వేదనల్ని మనసులోపెట్టుకొని కుంగిపోతున్న రోగికి ఇట్లా నలుగురితో చెప్పుకోవడం వల్ల కొంత భారం తగ్గటమే కాక, ఇలాంటి ఇబ్బందులు తనకే కాకుండా చాలామందికుంటాయని తెలుస్తుంది. ఇలాంటి చర్చ లను ఒక దోవలో నడపటం, పనికిమాలిన మాటల్తో కాలం వృథా కాకుండా చూడటం సోషల్ వర్కర్ పని. రోగుల మధ్య జరిగే సంభాషణలను గమనిస్తూ, వాళ్లు తమ గురించి చెప్పుకునేదాన్ని బట్టి, ఇతర రోగుల విషయంలో వాళ్లు వ్యక్తపరిచే అభిప్రాయాలను బట్టీ, వాళ్ల జబ్బుల గురించి కొంత అవగాహన ఏర్పరచు కుంటుంది సోషల్ వర్కర్.

సాయంత్రం జరిగిన గ్రూప్ థెరపీలో ఎమిలీ మిగతావాళ్లతో సులభంగానే కలిసిపోయింది. ఆ గ్రూపు లో డ్రగ్స్ వాడడంతో డిప్రెషన్లో పడిపోయిన వాళ్లున్నారు. భార్యో, భర్తో వదిలెయ్యడం వల్ల మానసికంగా దెబ్బ తిన్న వాళ్లున్నారు. తాగుడు వల్ల ఆరోగ్యం క్షీణించిన వాళ్లున్నారు. తన గురించి మాట్లాడుతూ, బొత్తిగా తీరిక లేకుండా ఉండడమే తన వ్యాధికి కారణం అని చెప్పింది ఎమిలీ. ఇంతకుముందు అలాంటిదేమీ లేదని కమలతో అన్నట్టు గుర్తొచ్చి, కళ్లతోటే కమలకు క్షమాపణ చెప్పింది. 'ఫరవాలేదు, మాట్లాడండి,' అన్నట్టు జవాబు గా చూసింది కమల.

చిన్నప్పట్నుంచీ పెన్సిల్తో బొమ్మలు గీయటం ఇష్టం అట ఎమిలీకి. తన చిత్రాలు అప్పుడప్పుడూ ఎగ్జిబిషన్లో కూడా ప్రదర్శించబడ్డాయట. కానీ, దాదాపు పది సంవత్సరాల్నించీ తనకు బొమ్మలు గీయడానికి సమయం దొరకడంలేదట. ఎప్పుడూ ఏవో పన్లుంటు న్నాయట.

"శనాదివారాలేం జేస్తుంటావు? అప్పుడు గీసుకో రాదూ బొమ్మలు?" అందొకావిడ.

రెండు క్షణాలు మౌనంగా ఉండిపోయింది ఎమిలీ. కొంచెం తేరుకొని, "సోమవారం నుంచి శుక్ర వారం దాకా చెయ్యడానికి వీలుగాని పన్లన్నీ శనాదివారా లకు నెట్టుకుంటూ వస్తాను. అందువల్ల అసలు శని వారం, ఆదివారం సెలవు రోజుల్లాగా ఉండవు. పనికెళ్లే రోజుల కంటే అప్పుడే ఎక్కువ పన్లుంటయ్," అంది ఎమిలీ నిస్సహాయంగా నవ్వుతూ.

ముఖకవళికల్ని బట్టి చూస్తుంటే ఈమెకు జబ్బుంటూ ఉన్నట్లు ఎవరికీ అనిపించలేదు. కమల క్కూడా ఈమె జబ్బుకు కారణం ఏమిటో ఇంకా అంతు బట్టలేదు.

రోగి కుటుంబంతో కలిసి మాట్లాడటం, జబ్బును గురించి వాళ్లకేమైనా ప్రశ్నలుంటే సమాధానాలు చెప్పటం, కుటుంబ పరిస్థితుల గురించి వాళ్లనడిగి రోగి మీద వాటి ప్రభావం గురించి ఆలోచించటం కూడా సోషల్ వర్కర్ బాధ్యతల్లో ఒకటి.

*

మరుసటిరోజు శనివారం. ఎమిలీ భర్త రాబర్టూ, పెద్ద కూతురు మార్తా వచ్చారు. తొమ్మిది గంటలకు రావాల్సినవాళ్లు పదిహేను నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. వస్తూనే క్షమాపణలు చెప్పుకుంటూ, తల్లి హాస్పిటల్లో ఉండటం వల్ల తనకు చాలా ఇబ్బందిగా ఉందనీ, పిల్లలను చెల్లెలి ఇంటి దగ్గర వదిలేసి తిరిగి వచ్చేటప్పుడు ట్రాఫిక్ వల్ల ఆలస్యం అయిందనీ వల్లె వేసింది మార్తా. "ఫరవాలేదు," అని, "పిల్లలు ఎంత వయసువాళ్లు" అని పరామర్శించింది కమల. ఇద్దరు కొడుకులనీ, వయసు మూడు సంవత్సరాలూ, ఒక సంవత్సరమూ అని చెప్పింది మార్తా. ఇంటికి దగ్గర్లో ఎవరూ బేబీ సిటర్ దొరకరా అని అడిగితే, నవ్వుతూ, పిల్లలకు అమ్మమ్మ దగ్గర బాగా అలవాటు అయిందనీ, ఇప్పుడామె హాస్పిటల్లో ఉండటంవల్ల చాలా ఇబ్బందిగా ఉందనీ చెప్పింది మార్తా.

ఇంకా తెలిసిన విషయాలేమిటంటే, మార్తా చెల్లెలు ఎలిజాక్కూడా ఒక కూతురుంది. ఆ అమ్మాయికి కూడా మూడో ఏడు. ఒక శనాదివారాలు మార్తా బిడ్డల్నీ, తర్వాత శనాదివారాల్లో ఎలిజా కూతుర్నీ చూస్తుంటుంది ఎమిలీ. ఒక్కోసారి ఇద్దరూ తమ పిల్లల్ని అమ్మ దగ్గర వదిలేసి ఏవో పన్లు చూసుకుంటుంటారు.

ఎమిలీ జబ్బుకు కారణం ఏమిటో తెలిసినట్లని పించింది కమలకు. పాపం ఆమెకు అసలు తీరికేదీ?

"ఆరోగ్యం బాగుపడాలంటే, ఎమిలీకి విశ్రాంతి చాలా అవసరం. ప్రతి శనాదివారాలూ మనుమల్నో, మనుమరాలినో చూసుకుంటూ ఉండటంతో ఆమె కసలు తీరిక లేకుండాపోయింది," అని మార్తాతో, రాబర్టుతో నిర్మొహమాటంగా చెప్పింది కమల. మార్తా దోషిలాగా నిలబడింది. ఇంటి దగ్గరున్న ఎలిజా మీద అసూయ పొంగింది.

మరుసటిరోజు ఉదయం మళ్లీ ఎమిలీతో మాట్లా డింది కమల. ముఖం చూస్తుంటే ఆమె రాత్రి బాగానే నిద్రపోయిందనిపించిది. బాగున్నారా అనడిగితే సౌమ్యం గా, అవును అన్నట్లు తలూపింది.

''నాకు బాగానే ఉంది. ఇక డిస్చార్జి చేయించ రాదూ'' అని అడిగిందామె.

''మీరు మనోవ్యాధితో ఇక్కడకొచ్చారు. దానికి కారణం తెలియకుండానే ఇంటికి పంపిస్తే, మళ్లా రెండురోజుల్లో తిరిగొస్తారు.''

''అబ్బే, అదేంలేదు. మనోవ్యాధంటూ ఏమీలేదు. విశ్రాంతి లేక అలా అయింది. ఈ రెండురోజుల్లో చాలా విశ్రాంతి దొరికింది. మళ్లా ఇక్కడకు రావాల్సిన అవసరం ఉండదు.''

''విశ్రాంతి దొరకటానికి జీవితవిధానంలో ఎలాటి మార్పులు తెచ్చుకోవాలో మీరు ఆలోచించారా?''

''ఏముందీ ఆలోచించటానికి? జీవిత విధానం మార్చుకోటం అంత సులభమైన పని కాదు. ఎలాగో బండినడుపుకుంటూ పోవటమే! నువ్వింకా చిన్నదానివి. జీవితం గురించి నీకంతగా తెలియదింకా.''

''మార్పులు రావటం సులభం గాదు. నిజమే. కానీ, ఒక జీవిత విధానం మిమ్మల్ని రోగిగా తయారు చేసిందంటే, దాన్ని మార్చుకోలేకపోతే మీ ఆరోగ్యం చెడి పోతుంది'' అని, ఈ ఘటం ఎలాగూ అసలు విషయం గురించి మాట్లాదనుకుని, ''మీరసలు శనాదివారాల్లో అంతగా చేసేదేమిటి,'' అని అడిగింది.

''నాకు ఇల్లు శుభ్రంగా ఉంచుకోవటం ఇష్టం. పనికెళ్లే రోజుల్లో ఇల్లు శుభ్రం చెయ్యటం వీలుపడదు. అందువల్ల వాక్యూం చెయ్యటం, వంటగది ఫ్లోర్ తుడవటం, బాత్రూమ్ శుభ్రం చెయ్యటం, బట్టలుతుక్కోవటం ఇవన్నీ శనాదివారాల్లోనే.''

''నిజమే. కానీ, ఇవి అందరూ చేసుకునే పన్లే. రెండు రోజులు విరామం లేకుండా చేసుకోవటానికి సరిపడే పన్లు కాదు.''

''శనివారం పదీ పదకొండు గంటలకల్లా పన్లన్నీ అయిపోవాలి. అప్పటికి మా మనవలూ, మనవరాలూ వచ్చేస్తారు. వాళ్లొచ్చింతర్వాత పన్లు చేసుకోవటం వీలు పడదు.''

''అంటే మీరు అమ్మమ్మలన్నమాట! ఆ మాట చెప్పలేదేం మరి! ఎంతమంది పిల్లలు మీ అమ్మాయిలకి? ఎన్నేళ్లుంటాయి?''

''పెద్దమ్మాయి మార్షాకి ఇద్దరబ్బాయిలు. వాళ్లకి వయసు మూడు సంవత్సరాలూ, ఒక సంవత్సరం. చిన్నమ్మాయి ఎలిజాకు ఒక కూతురు. దానికి మూడేళ్లు.''

''నెలకెన్నిసార్లొస్తారు పిల్లలు మిమ్మల్ని చూడ్డానికి.''

''నెలకా. ప్రతి శనాదివారాలూ ఎవరో ఒకరు పిల్లల్ని నా దగ్గరొదిలేసి వెళ్తారు. ఒక్కొక్కసారి ఇద్దరికీ పన్లుంటాయి. ఇద్దరి పిల్లలూ నా దగ్గిరే ఉంటారు.''

''మరి మీవారున్నారుగా. ఆయన రిటైరయ్యారు కూడా. పిల్లల్నాయనదగ్గరొదిలేసి మీరు కొంచెంసేపు విశ్రాంతి తీసుకోవచ్చుగా.''

''ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం. శనివారం ఎప్పుడొస్తుందా అని చూస్తుంటాడు, పిల్లలొస్తారు కదా అని. కానీ, ఆ టీవీలో ఎప్పుడూ ఏవో ఆటలొస్తూనే ఉంటాయి. వాటిని చూస్తూ పిల్లల సంగతి మర్చిపోతాడు. వాళ్లేదో కిందకు లాగటమో, పైన పడేసుకోవటమో చేస్తుంటారు,'' అంది నిస్సహాయంగా ఎమిలీ.

''సరే. మీకెందుకు విశ్రాంతి లేదో మీకు బాగా తెలుసు. మరి పరిస్థితులు మారాలంటే ఏం చెయ్యాలో కూడా మీకు బాగానే తెలిసుంటుంది. కానీ, ఆ మార్పు ఎలా తీసుకురావాలా అనేదే ముఖ్యమైన విషయం.''

''చూడు కమలా, నీ పేరు కమలే కదూ! కమలా అని పిలుస్తాను నువ్వేమీ అనుకోకపోతే. తల్లులూ, కూతుళ్లూ ఉన్నంతకాలం కూతుళ్లు తల్లుల మీద ఆధార పడుతూనే ఉంటారు! నాకు పిల్లల్ని చూట్టం వీలుకాదు. ఎవర్నయినా బేబీ సిటర్ని చూసుకోండి అని చెప్పటం ఏం బాగుంటుంది చెప్పు. మనవల్నీ, మనవరాళ్లనూ గారాబం చేసి పాడు చెయ్యటం అనాదిగా వస్తున్న ఆచారం,'' అంది ఎమిలీ నవ్వుతూ.

''ఎప్పుడూ కాదనటం కాదు. మీకు వీలు కానప్పుడూ, అలసటగా ఉన్నప్పుడూ, ఈరోజేదైనా బొమ్మలు గీసుకుంటే బాగుండూ అని అనిపించినప్పుడూ వీలు కాదని చెప్పండి. మిమ్మల్నెవరూ తప్పుపట్టరు,'' సలహా చెప్పింది కమల.

చూస్తాన్లే అన్నట్లు తలూపింది ఎమిలీ.

*

ఎమిలీ డిస్చార్జయి వెళ్లిపోయింతర్వాత కూడా ఆమె గురించి చాలాసార్లు ఆలోచించింది కమల.

ఎమిలీకి కూతుళ్లంటే చాలా ఇష్టం. వాళ్లకీ తల్లి మీద చాలా ప్రేమ. మరి తల్లినెందుకు, వాళ్లు అలా అనాలోచితంగా తమ అవసరాలకు వాడుకుంటున్నారు.

రాబర్ట్ అనవసరంగా ఒక్కమాట కూడా మాట్లాడడు. అవసరమైతే తప్ప ఒక్కపనీ చెయ్యడు ఇంట్లో. ఎమిలీతో ఉంటున్నాడే కానీ, అతని ప్రపంచం వేరే లాగుంది. అందువల్లే ఎమిలీ పరిస్థితి విషమించేంత వరకు గుర్తించలేదు.

తాను చెయ్యలేని రోజుకూడా ఈరోజు పిల్లల్ని చూడటం నాకు వీలుకాదు అనలేదు ఎమిలీ. ఎందువల్ల? వీలుకాదంటే తాను మాతృమూర్తి స్థానం నుంచి పడిపోతుందని భయమా?

*

కొన్నాళ్ల తరువాత ఒకరోజు కమలనూ, నారాయణనూ భోజనానికి పిల్చారు వెంట్రామిరెడ్డి, సులక్షణలు. వాళ్లకీమధ్య కొడుకు పుట్టాడు. అదీగాక ఇన్నాళ్లు ఎపార్ట్‌మెంటులోఉన్నవాళ్లు ఈమధ్య ఒక ఇల్లు కొనుక్కున్నారు. వచ్చే ఆదివారం వాళ్లింట్లో గృహప్రవేశం జరుపుకుంటారు. సత్యనారాయణస్వామి పూజ కూడా చేస్తారు. ఈ సందర్భంగా మిత్రులందరినీ భోజనాలకు పిల్చారు.

ఆరోజు వాళ్లింటికెళ్లేసరికి కొంచెం ఆలస్యం అయింది వీళ్లకు. కమల తయారయ్యేసరికి మామూలుగా ఆలస్యం అవుతూనే ఉంటుంది. తలుపు తట్టగానే అంతకుముందే వచ్చినవాళ్లలో ఒకతను తలుపు తీశాడు.

"నమస్కారం రండి," అని, "ఆడవాళ్లంతా వంటగదిలో ఉన్నారు,'' అన్నాడు కమలను చూస్తూ. నారాయణని చూస్తూ, "మగాళ్లు కొంతమంది బేస్‌మెంటులో ఉన్నారు. కొందరిక్కడ లివింగ్ రూమ్‌లో ఉన్నారు,'' అన్నాడు. నీ ఇష్టం వచ్చినచోట చతికిలపడమని ఆహ్వానిస్తూ.

లివింగ్ రూమ్‌లో ఇంకా ఫర్నిచర్ ఏమీలేదు. మడత కుర్చీల మీద ఒక సర్కిల్లో కూర్చొనున్నారు అతిథులంతా. ఒక్కొక్కరితో చేతులు కలుపుతూ, నా పేరు నారాయణ అని చెప్తూ, అతని పేరు వింటూ, అందరితో పరిచయం చేసుకొని ఒక కుర్చీలో కూర్చున్నాడు నారాయణ. అప్పటికే సంభాషణ జోరుగా సాగుతున్నట్లుంది. నారాయణతో పరిచయాలు ముగించడమే ఆలస్యంగా మళ్లా మొదలైంది. బాబ్రీ మసీదూ, అయోధ్య, చర్చిల మీద బాంబులూ, వీటి మీద రకరకాల సిద్ధాంతాలూ, వేడి వేడి వాదోపవాదాలూ. నారాయణకు రెండు నిమిషాల్లోనే బోర్ కొట్టింది. పొద్దుటే ఇంత లోతైన విషయాలెలా దొరుకుతాయి వీళ్లకు? ఎవ్వరికీ ఇబ్బంది కలక్కుండా అక్కణ్ణించి లేచి మెల్లగా బేస్‌మెంట్ చేరుకున్నాడు నారాయణ. బేస్‌మెంట్ పెద్దది. ఒకవైపు టేబుళ్ల మీద తిండి పదార్థాలన్నీ అమర్చబడి ఉన్నాయి. రెండోవైపు రెండు గ్రూపులుగా మడతకుర్చీల మీద కూర్చొని బాతాఖానీలు కొడుతున్నారు గెస్టులు. ఒక గ్రూపుకు దగ్గరగా వెళ్లి కూర్చున్నాడు నారాయణ. పరిచయాల జోలికి పోవటం అనవసరమనుకున్నాడు. సంభాషణ ఇక్కడ కూడా జోరుగానే సాగుతోంది.

''చంద్రబాబంత గౌరవం ఉన్న ముఖ్యమంత్రి మరొకడు లేడు,'' అన్నాడొకాయన.

''అసలు చంద్రబాబు సీఎం కాకముందు న్యూయార్క్ స్టాక్ మార్కెట్‌లో ఒక్క ఇండియా కంపెనీ కూడా ఉండేది కాదంట. ఇప్పుడు మనోళ్లవి అర్ధడజను కంపెనీలున్నై,'' అన్నాడింకొకతను.

"ఆసియా ఖండం మొత్తంలో నాయుడంత గొప్ప నాయకుళ్లేడని సింగపూరు పత్రికలన్నీ రాసినయ్యంట," అన్నాడింకొకతను.

''సింగపూరే కాదు. జపాన్‌లో, చైనాలో అందరూ చంద్రబాబు గురించేనంట మాట్లాడుకోవడం. ఆయన పుణ్యమా అని జపాన్ వాళ్లు హైదరాబాదొస్తున్నారంట కంప్యూటర్ల గురించి నేర్చుకోవడానికి," అన్నాడొకాయన.

''పూజ మొదలు పెడుతున్నారండీ,'' అని అందరినీ ఈ లోకంలోకి తీసుకొచ్చిందొకావిడ. లేచి పైకెళ్లటానికి సిద్ధమయ్యారంతా.

*

ఫామిలీ రూమ్‌లో పూజకు అంతా సిద్ధం చేశారు. సత్యనారాయణ పటం. దానిముందు పూజ సామాగ్రి, ఒకవైపు పూజారి, రెండోవైపు వెంకట్రామిరెడ్డి, సులక్షణ కూర్చున్నారు. వాళ్ల ముందు నాలుగైదు వరుసల్లో ఆడవాళ్లూ, వాళ్ల వెనుక కొందరు నేలమీద, కొందరు మడత కుర్చీల మీద మగవాళ్లూ కూర్చున్నారు. పూజ పదకొండు గంటలకు మొదలైంది. పూజారి అతివేగంగా మంత్రాలు చదివాడు. అప్పుడప్పుడూ తాను చదివిన మాటలను వెంకట్రామిరెడ్డినీ, సులక్షణనూ పలకమన్నాడు. కానీ, వాళ్ల మాటల్ని అనడానికి సరైన వ్యవధి ఇవ్వకుండానే తర్వాతి మాటలకెళ్లాడు. మధ్యమధ్యలో ఒక నడివయసులో ఉన్నామెను ఏవేవో తీసుకురమ్మని పురమాయించాడు. ఆమె వంటగదిలోకెళ్లి అడిగిన వస్తువులు తెచ్చిచ్చింది. ఆమె వెంకట్రామిరెడ్డి తల్లో, సులక్షణ తల్లో అయుంటుందనుకున్నాడు నారాయణ.

పూజ జరుగుతుంటే వెనుక చేరి మగవాళ్లు ఏవేవో సంభాషణలు సాగిస్తూనే వచ్చారు. అప్పుడప్పుడూ పూజారి వారిని, 'కొంచెం చిన్నగా మాట్లాడుకోండి బాబూ,' అన్నట్లు చూశాడు. దాదాపు పన్నెండున్నరకు పూజ అయిపోయింది. ముందు వరుసలో కూర్చున్న ఒకామెకు సత్యనారాయణ వ్రతకథ చదవమని పుస్తకమొకటిచ్చాడు పూజారి. కొంతసేపు ఆమె చదివి, రెండో కథను చదవమని పక్కావిడకిచ్చింది.

"అసలు ముందు కథ చదివి, తర్వాత పూజ చేస్తే మంచిదండీ. పూజను శ్రద్ధగా చూడకుండా కబుర్లు చెప్పుకునేవాళ్లను దేవుడు ఎలుకలుగానో, పిల్లులుగానో, కందగడ్డలుగానో చేసి పారేస్తాడని కథ చెప్పి, తరువాత పూజ మొదలుపెడితే అందరూ గప్‌చుప్‌గా ఉంటారు,"

అన్నాడు పక్కన కూర్చున్నాయన, తన తెలివితేటలకు తానే మురిసిపోతూ. "ఔను," అన్నాడు నారాయణ.

కథా పారాయణం జరుగుతుండగానే కొందరు ఆడవాళ్లు బేస్‌మెంట్‌లో కెళ్లి భోజనాలు ప్లాస్టిక్ ప్లేట్లలో పెట్టటం మొదలుపెట్టారు. కొందరు మగవాళ్లు ప్లేట్ల కోసం లైన్లో నిలబడ్డారు. అప్పటికే లైను పొడుగ్గా వుండటం చూసి నారాయణ ఒక కుర్చీలో కూలబడ్డాడు.

ఇంతలో నారాయణను వెతుక్కుంటూ వచ్చింది కమల. "వాళ్లబ్బాయిని చూశావా," అని అడిగి, లేదని అతను తలూపితే, "మరి చూద్దాం రా," అని అతన్ని పైకి లాక్కెళ్లింది.

వెంకట్రామిరెడ్డి తల్లి కాబోలు, పిల్లాణ్ణి చేతుల్లో పెట్టుకొని ఉయ్యాల్లా ఊపుతోంది. ఆమె దగ్గరికెళ్లి "నమస్కారం" అన్నారు వీళ్లిద్దరూ. పిల్లాణ్ణి చూడ్డాని కొచ్చారని గుర్తించి, "రండి, ఇప్పుడే నిద్రపోయాడు," అంటూ, కొంచెం పక్కకి తిరిగింది పిల్లాడి ముఖం వాళ్లకు కనిపించేటట్టు.

"అంతా వాళ్ల నాన్నలాగే ఉంది కదూ ముఖం," అందామె.

"అవునండీ. మీరు వెంకట్రామిరెడ్డి తల్లిగారు కదూ," అనడిగాడు నారాయణ.

"కాదు బాబూ. సులక్షణ వాళ్లమ్మని."

"అలాగా, మీ అమ్మాయి చేత పూజ బాగా చేయించారండీ," అంది కమల.

సంతోషంతో, అభినందనలు అలవాటు లేక వచ్చిన సిగ్గుతో తలొంచుకుందావిడ. "ఏదోలేమ్మా. మీలాంటివాళ్లు అండగా ఉంటే, వాళ్లు బాగానే వుంటారు."

కట్టూ బొట్టూతో పాటు ఆమె మాటలు కూడా నిరాడంబరమైన పల్లెటూరి మనిషని చెప్తున్నాయి. ఇండియాలో తనవారంతా గుర్తుకొచ్చారు నారాయణకు.

"మీరొచ్చి ఎన్నాళ్లయిందండీ?"

"రెండు నెల్లు దాటీ ఆర్రోజులయిందయ్యా," రోజుల్లెక్కబెట్టుకుంటోందని చెప్పనవసరం లేకుండానే చెప్పిందామె.

"ఈ ఊరు నచ్చిందా మీకు."

"బాగానే ఉందయ్యా. అంతకుముందున్న గదిలో ఇరుగ్గా ఉండేది. ఈ ఇంట్లోకొచ్చి పన్నెండురోజు లయింది. ఇక్కడ చానా స్తళం ఉంది. పిల్లోడు అటూ ఇటూ తిరిగే వయసొచ్చేటప్పటికి ఇక్కడ బాగుండిద్ది."

"ఇల్లు కాదండీ. ఈ ఊరు మీకు నచ్చిందో లేదో అని."

"ఊరి సంగతి నాకేం తెలుసయ్యా," అందామె.

"మీ ఊళ్లో ఏం చేస్తుంటారీ రోజుల్లో."

"ఏముందయ్యా, మామూలు పన్లే. చేలల్లో పన్లెప్పుడూ ఉండేయే. పొగాకూ, పత్తీ, వొరీ ఏస్తారు మా ఊళ్లో. ఆ పత్తికెప్పుడూ ఏదో సేవజేస్తూనే ఉండాల. రోజుమార్చి రోజు ఏవేవో మందులు గొడ్తుండాల. అంతా జేస్తే అందులోంచి వొచ్చేదీ లేదు పెట్టేదీలేదు. ఈయ నేమో పొద్దస్తమానం ఆ పొలంకాడే బడుంటాడు."

ఆమె మనసెక్కడుందో అర్థమయింది నారా యణకు. ఇంతలో ఇంకెవర్నో తీసుకొచ్చింది సులక్షణ పిల్లాణ్ణి చూట్టానికి. ఆమెవైపు తిరిగి, "ఊరికి పంపించే లోగా మీ అమ్మగార్ని మా ఇంటికొకసారి తీసుకురండి," అన్నాడు నారాయణ.

"అలాగేనండి. ఉంటుందిలెండి రెండు మూణ్ణెల్లు. మొన్ననేగా వొచ్చింది," అంది సులక్షణ.

*

భోజనాలయింతర్వాత తిరిగి ఇంటికెళ్లేటప్పుడు సులక్షణ వాళ్లమ్మ గురించి ఆలోచిస్తూ కూర్చుంది కమల. పాపం ఆమె మనసు ఇండియాలోనే ఉంది. తన పనులు, ఇష్టాయిష్టాలు వదిలేసి, కూతురు అడిగితే కాదనలేక అమెరికా వచ్చుంటుందామె. పొలం పన్లున్నయ్. సహాయంగా ఉంటావు, నాలుగు నెల్లు ఇండియా రమ్మని కూతుర్నడుగుతుందా ఆమె? అడగదు. కానీ కూతురు అడగ్గానే వచ్చుంటుంది. నాకు వీలుగాదు అని చెప్పగలదా ఆమె? చెప్పలేదు. 'అమ్మ' అంటేనే ఇవ్వటం అని అర్థం. తీసుకోవటం కాదు.

ఎమిలీ గుర్తొచ్చింది కమలకి. దేశం, జాతి, మతం, భాష, వేషం- దేంట్లోనూ కలవని ఎమిలీ, సులక్షణ వాళ్లమ్మ పిల్లల విషయంలో మాత్రం ఒకే విధంగా ప్రవర్తిస్తారు. కారణం?

"ఏంటి ఆలోచిస్తున్నావు?" డ్రైవ్ చేస్తున్న నారాయణ అడిగాడు.

"సులక్షణ వాళ్లమ్మను ఇక్కడకు తీసుకురావటం బాగాలేదుకదా," అంది కమల.

"ఏం?"

"ఆమె భర్త ఇంటి దగ్గర పొలం పనుల్లో ముని గున్నాడు. ఆమె మనసక్కడే ఉంది."

"అవుననుకో. వీళ్లకు ఇల్లు కొనుక్కోవటం, డెలివరీ అన్నీ ఒకేసారి రావటం వల్ల సులక్షణ ఇండియా పోలేక, వాళ్లమ్మనే ఇక్కడకు తీసుకొచ్చుకుంది. ఇది మామూలేగా?"

"ఏది మామూలు?"

"డెలివరీకి అమ్మగారింటికి పోవటం, లేక అమ్మను అమెరికా తీసుకొచ్చుకోవటం. నువ్వు మాత్రం చెయ్యవూ అట్లా?"

"చెయ్యను. మా అమ్మే రావాలని ఏముంది? మీ అమ్మగారెందుకు రాగూడదూ? అసలు వాళ్లెందుకూ రావటం? నువ్వే ఎందుకు సహాయం చెయ్య గూడదూ?"

"చెయ్యొచ్చు. కానీ, అన్నిరోజులు సెలవు దొరకద్దూ?"

"అంటే కనటానికి నాకు సెలవు దొరుకుతుంది గానీ, కొన్నాళ్లపాటు సహాయం చెయ్యటానికి నీకు సెలవు దొరకదంటావు? లేక ఇట్లాంటి పన్లు చెయ్య టానికి సెలవు తీసుకోవటం దండగ అనా?"

"ఇప్పుడిదంతా మనకెందుకు? ప్రస్తుతం పిల్ల లొద్దనుకున్నాంగా మనం."

"ఇప్పుడయినా, నాలుగేళ్ల తర్వాతైనా పన్లు చేసి పెట్టటానికి మా అమ్మను తీసుకొద్దాం అంటే నేనొప్పు కోను."

"సరే నీ ఇష్టం. కానీ, ఇలాంటి మాటలు నేనె ప్పుడూ విన్లేదు."

"ఎలాంటి మాటలు?"

"కాన్పుకు తల్లిని సహాయంగా తీసుకొచ్చుకో వటం ఆడవాళ్లందరూ చేసేదే. అది తప్పని నువ్వెందు కనుకుంటున్నావో నాకర్థంగావటంలా."

"అమెరికా చూపించటానికి ఆమెను తీసుకొద్దాం అంటే నాకేమీ అభ్యంతరం లేదు. కానీ, నీకు ఇంట్లో పన్లు చెయ్యటం ఇష్టంలేక ఆమెను తీసుకొద్దాం అంటే మాత్రం నేనొప్పుకోనంటున్నాను."

"పోన్లే. మా అమ్మ వొస్తుందేమో?"

"మా అమ్మైనా, మీ అమ్మైనా ఒకటేనన్నాను కదూ? వాళ్లెందుకు రావటం?"

"నువ్వెందుకిలా తలతిక్కగా మాట్లాడుతున్నావీ రోజు? తల్లి కూతురుకు సహాయం చెయ్యటం తర తరాలుగా వస్తున్న ఆచారం."

"అవచారం."

"అంటే?"

"అవసరాలు తీర్చుకోవటానికి చేసిన ఏర్పాటు. ఆడవాళ్ల చేత పన్లు చేయించుకోవటానికి కనిపెట్టిన గొప్ప పవిత్ర సంబంధం."

"కమలా, నువ్వేదో స్త్రీవాదం గొడవలో పడ్డట్టు న్నావు."

"అవును. కడుపులు చెయ్యటం పురుషవాదం గొడవ, పురుళ్లు పొయ్యటం స్త్రీవాదం గొడవ."

ఈ సంభాషణ శ్రుతి మించింది. మరేదైనా విషయం గురించి మాట్లాడుకుంటే బాగుంటుందని పించింది నారాయణకు.

హైవే నుంచి బయటికొచ్చేసి ఒక చిన్న వీధి గుండా పోతోంది కారు. రెండువైపులా పెద్దపెద్ద ఇళ్లూ, వాటి ముందు చక్కగా తీర్చిదిద్దినట్లు పూలవనాల్లా వున్న లాన్లూ చూస్తూ, "ఇళ్లు ఎంత బాగున్నాయో చూడు కమలా," అన్నాడు నారాయణ.

"ఈ ఇళ్లవాళ్లు బైట పని చెయ్యరు. ఆ మెక్సికో వాళ్లున్నారుగా వీళ్లకు పన్లు చెయ్యటానికి. వాళ్లు లేకపోతే ఇంత అందంగా ఉండవు వీళ్ల ఇళ్లూ, లాన్లూ," అంది కమల.

"మెక్సికో వాళ్లు ఊరికే వొచ్చి పనిచెయ్యటం లేదుకదా కమలా. వీళ్లు ఖర్చులు పెట్టి, వీసాలూ అవీ తెప్పించి తీసుకొస్తేనే గదా వాళ్లు రాగలిగింది."

"అవును. వెంకట్రామిరెడ్డి వాళ్లత్తను తీసుకొచ్చి నట్లు."

"కమలా, ఇండియా నుంచి వాళ్లను తీసుకు రావటం, మెక్సికో నుంచి పన్లు చేసేవాళ్లను తీసుకు రావటం రెండూ సమానం అంటున్నావా?"

"నువ్వు కాదంటావా?"

"అవును."

"ఏంటీ తేడా?"

"మెక్సికో నుంచి వచ్చేవాళ్లు అక్కడ పన్లు దొరక్క వస్తున్నారు. సులక్షణ వాళ్లమ్మ కూతురి మీద ప్రేమకొద్దీ వచ్చింది."

"ఆమె రావటానికి కారణం ప్రేమ కావచ్చు. ఆమెను తీసుకురావటానికి కారణం మాత్రం ప్రేమ కాదు. బేబీ సిటర్ దొరక్కపోటం. సులక్షణకు ఉద్యోగం వదులుకోవటం ఇష్టం లేక పోవటం. వెంకట్రామిరెడ్డికి కొన్నాళ్లు సెలవు తీసుకొని ఇంట్లో సహాయం చెయ్య టానికి ఇష్టం లేకపోవటం."

"నిజం చెప్పనా కమలా? అందమైన తల్లీబిడ్డల సంబంధంలో లేనిపోని లోపాలు చూపించటానికి ప్రయత్నం చేస్తున్నావు నువ్వు. ఎందుకు అలా చేస్తున్నావో నాకర్థంగావటంలా?"

"ఒక్కొక్కసారి ఈ అందమైన సంబంధాల వెనుక వినపడని, కనపడని బాధలుంటై," అంది కమల. ఎమిలీ తలపుకొచ్చి, మౌనంగా ఉండిపోయింది.

*ఇండియా టుడే వారపత్రిక, 2 జనవరి, 2001*